క్లుప్తంగా

అక్రమ అరెస్టులతో గొంతు నొక్కుతున్నారు



అలంపూర్: ఆశా వర్కర్ల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.నరసింహ అన్నారు. అలంపూర్‌లో ఆశా వర్కర్ల సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. హక్కుల కోసం వెళ్తున్న వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని, ప్రభుత్వం స్పందించి వెంటనే వారికి రూ.18వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ధరూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి (ఎస్‌జీఎఫ్) కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, కబడ్డీ కన్వీనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన అండర్–14, అండర్ –17 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని వారు సూచించారు.

ఆదిశిలాక్షేత్రంలో ఎమ్మెల్యే సతీమణి పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమెను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్, మధు, సవారన్న ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థిని అభినందించిన బీఎస్పీ నాయకులు



గట్టు: వైద్య విద్యలో సీటు సాధించిన గొర్లఖాన్‌దొడ్డికి చెందిన సరితారాణిని సోమవారం బీఎస్పీ నాయకులు ఘనంగా సన్మానించారు. బీఎస్పీ జిల్లా కార్యదర్శి మాచర్ల ప్రకాష్, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌లు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బల్గెర సునంద్, సామాజిక కార్యకర్త బల్గెర ప్రవీణ్ పాల్గొన్నారు.

కోకాపేటకు సగర సంఘం సభ్యులు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి సగర సంఘం నాయకులు, సభ్యులు కోకాపేటలో నూతన ఆత్మగౌరవ భవన నిర్మాణానికి భూమిపూజకు బయలుదేరారు. సోమవారం అలంపూర్ చౌరస్తా నుంచి భారీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో సగర సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, సర్పంచ్ రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, వెంకటేష్, పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కోకాపేటలో చేపట్టిన సగర కుల ఆత్మ గౌరవ భవన నిర్మాణ భూమిపూజకు సగర సంఘం నాయకులు తరలి వెళ్లారు. జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన సగర సంఘం నాయకులు ఉన్నారు.

రెండు బైకులు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: రెండు బైకులు ఢీకొని వ్యక్తులకు గాయాలైన ఘటన మండలంలోని ఉండవెల్లి శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జాతీయ రహదారిపై ఉండవెల్లికి బైక్‌పై మద్దిలేటి, వేణు వెళ్తున్నారు. కంచుపాడుకు చెందిన ఉస్సేన్ ఎదురుగా బైక్‌పై వస్తూ మూలమలుపు వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో మద్దిలేటికి తీవ్ర గాయాలు కావడంతో 108లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అతనికి ఎలాంటి ప్రాణాపాయం లేదని ఆస్పత్రి వైద్యులు తెలిపినట్లు పేర్కొన్నారు.

శివోహం.. శివోహం

- ఆలయంలో రథోత్సవం

జోగుళాంబ శక్తిపీఠం: శ్రీశైల మహాక్షేత్రానికి పశ్చిమ ద్వార క్షేత్రమైన అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో శ్రావణమాసం చివరి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో ప్రదోశకాలంలో దేవతామూర్తుల విగ్రహాలను రథోత్సవంలో కూర్చోబెట్టి ఆలయం చుట్టూ ప్రాకార ప్రదిక్షలు చేశారు. వేదమంత్రాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు.

ఆలయాన్ని దర్శించుకున్న సూర్యపేట జెడ్పీ చైర్ పర్సన్

అలంపూర్ శ్రీ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను సూర్యపేట జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ దీపిక దర్శించుకున్నారు. మరో సందర్భంలో మెడికేర్ గ్రూప్ సంస్థల వైస్ చైర్మన్ లక్ష్మి దంపతులు కూడా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఉభయ ఆలయాల్లో తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు.

రాజోళి: మండల కేంద్రంలోని తుంగభద్ర నది మధ్యలో ఉన్న రాంపాటి శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం చివరి



జాంపల్లి శివారులో గట్టుకు కాలినడకన వెళ్తున్న భక్తులు

సోమవారం కావడంతో మహిళలు, భక్తులు నది మధ్యలో ఉన్న ఆలయానికి వెళ్లి అర్చనలు, అభిషేకాలు చేశారు. స్థానికంగా ఉన్న భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎర్రవల్లిచౌరస్తా: శ్రావణ చివరి సోమవారం పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు బీచుపల్లి శివాలయాన్ని దర్శించుకున్నారు. కొబ్బరికాయలు కొట్టి శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు.

శ్రావణ మాసం ప్రత్యేక పూజలు

ధరూరు: మండల కేంద్రంలో భక్తులు శ్రావణ మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం భక్తులు సోమవారం మండల కేంద్రం నుంచి జాంపల్లి శివారులో ఉన్న గట్టు వరకు కాలి నడకన వెళ్లి గట్టుపై వెలసిన వీరన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గట్టుపై నుంచి దేవుడిని తీసుకొచ్చారు. రాత్రి అఖండ నందికోలు సేవ ఉంటుందని, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శివాలయంలో ప్రత్యేక పూజలు



అలంపూర్‌లో పూజలు చేస్తున్న సూర్యపేట జెడ్పీ చైర్ పర్సన్ దీపిక



రాజోళి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



జోగుళాంబ ఆలయంలో రథోత్సవం

వైభవంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు

గద్వాల: ఇందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని సోమవారం శ్రీకృష్ణుడి విగ్రహ ఊరేగింపు వైభవంగా సాగింది. స్థానిక కొత్తబస్టాండ్ నుంచి ఊరేగింపు ప్రారంభమైంది. పట్టణ ప్రధాన రహదాల వెంట ఊరేగింపు సాగింది. పాటలు, కోలాటంతో భక్తులు హోరెత్తించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని పూజ , ఆధ్యాత్మిక ప్రవచనాలు, జ్ఞానం పాటలు, సత్సంగమం, నాటికలు, నృత్యాలు నిర్వహించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కృష్ణాష్టమి వేడుకల్లో బీజేపీ నేత డీకే అరుణ

భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి రాత్రి వరకు ముకుందా.. ముకుందా.. హరేకృష్ణ నామస్మరణలతో హోరెత్తించారు.

భక్తిశ్రద్ధలతో శివలింగ విగ్రహ ప్రతిష్ఠ



అయిజ: మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో వీరాంజనేయస్వామి దేవస్థానంలో శివలింగం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చిన్న దేవన్న ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు



ధరూరు వైఎస్సార్ చౌరస్తాలో సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



కేటీదొడ్డిలో సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

కేటీదొడ్డి: గద్వాల నిత్యాభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే అనర్హత కేసు పట్ల సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో మండల కేంద్రంలోని నాయకులు బాణాసంచ కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, నాయకులు టీచర్ గోవిందు, కొండన్న, యుగంధర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

న్యాయమే గెలిచింది

ధరూరు: ప్రతి పక్షాలు ఎన్ని ఎత్తులు వేసినా చివరకు న్యాయమే గెలిచిందని మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేపై అనర్హత వేటును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి అనుకూలంగా వెలువడి తీర్పుతో ధరూరు మండలంలో బాణాసంచ కాల్చి సంబురాలు చేసుకున్నారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు భీంరెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్, భరత్, సాగ ర్‌రెడ్డి, సత్యన్న, దావీదు, పెంటన్న పాల్గొన్నారు.

గట్టు: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించిన నేపథ్యంలో గట్టులో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిపై అనర్హత వేటు వేస్తూ, తీర్పు ఇచ్చిన హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీం కోర్టు స్టే విధించిందని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. గట్టు, మాచర్ల, గొర్లఖాన్‌దొడ్డి, ఆలూరు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

విగ్రహ నిర్మాణానికి విరాళం



అయిజ: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న సుంకులమ్మ ఆలయంలో విగ్రహ నిర్మాణానికి కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి విరాళం అందజేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన రూ.35 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ చేయాలి

గద్వాల అర్బన్: దళిత బంధు, బీసీ బంధు తదితర సంక్షేమ పథకాల్లో జరిగిన అవకతవకలపై అధికారులు విచారణ చేపట్టి తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నా బాషా డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కట్టే పన్నుతో ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. గద్వాల మండలం ఆనంతాపురంలో బీఆర్ఎస్ నాయకులు యువత చేతిలో అడ్డంగా దొరికిపోయారన్నారు. అధికారులు వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఐఎం నాయకులు అల్తాఫ్ హుస్సేన్, రఫీ, ప్రసాద్, ఇమాముద్దీన్, చాంద్, అంజాద్ ఉన్నారు.

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం అంగన్‌వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు నిరసన తెలిపారు.

విద్యార్థులు మొబైల్ వల్ల మోసపోకండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భరోసా, షీ టీమ్ సిబ్బంది

ఉండవెల్లి: విద్యార్థులు మొబైల్ వాడడం వల్ల అనేక రకాలుగా మోసపోతారని, వాటిని ఎక్కువ శాతం ఉపయోగించొద్దని భరోసా సిబ్బంది, షీ టీమ్ సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎస్పీ సృజన ఆధ్వర్యంలో విద్యార్థి, విద్యార్థినులకు భరోసా కేంద్రంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి వారిపై షీ టీమ్‌కు, భరోసా సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. మొబైల్ వల్ల చదువుకు ఇబ్బంది కలగకుండా ఆన్‌లైన్ క్లాసులకు మాత్రమే తప్పని పరిస్థితిలో ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో భరోసా సిబ్బంది శ్వేత, కవిత, షీ టీమ్ సిబ్బందిహన్మంతు, దివ్యవాణి పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిరండి

శాంతినగర్: తెలంగాణ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పిలుపుమేరకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే ఆత్మగౌరవ సభకు భారీగా తరలి రావాలని ఆ సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి బ్యాండ్ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అలంపూర్ తాలూకా పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన నాయీబ్రాహ్మణులు మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతికి చేరుకొని విజయవంతం చేయాలని కోరారు.

వ్యాధులకు మెరుగైన చికిత్స

- విలేకరుల సమావేశంలో యశోద ఆస్పత్రి వైద్యుడు కిషన్ నున్నవత

గద్వాల అర్బన్: మలక్‌పేట్‌లోని యశోద ఆస్పత్రిలో అధునాతన సౌకర్యాలు, సాంకేతిక వైద్య పరిజ్ఞానం , చికిత్స పద్ధతులతో గ్యాస్ట్రో ఎంటిరాలజీ వంటి మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి వైద్యుడు కిషన్ నున్నవత తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నవాహికకు సంబంధించి అకలాసియా కార్డియా అనే వ్యాధితో నోటి ద్వారా ఆహారం తీసుకోలేరన్నారు. ఈ వ్యాధి తీవ్రత పెరిగే కొద్ది రోగికి ఆహారం అందక నీరసించి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. గద్వాల మండలం బస్సాల్‌చెర్వు గ్రామానికి చెందిన పద్మమ్మ అనే వృద్ధురాలు 10ఏళ్లుగా నోటి ద్వారా ఆహార పదార్థాలు తీసుకునేందుకు చాలా ఇబ్బందులు పడేదన్నారు. మలక్‌పేటలోని యశోద ఆస్పత్రికి తీసుకరాగా, వైద్యులు ఆమెకు ఎండోస్కోపి విధానంతో మెరుగైన చికిత్స అందించామన్నారు. దీంతో 24గంటల్లోనే అకలాసియా కార్డియా అనే వ్యాధి తగ్గి ఆమె నోటి ద్వారా ఆహారం తీసుకుంటుందన్నారు. సమావేశంలో శ్రీనివాస్, సిబ్బంది, ఉన్నారు.



పద్మమ్మతో యశోద ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

అమరుల త్యాగాలను స్మరించుకుందాం

అలంపూర్: దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేందుకు ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ సీనియర్ నాయకులు కురవ చిన్న మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి అన్నారు. సోమవారం అలంపూర్ పట్టణంలో 279, 280, 278 వార్డుల్లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సేకరించిన మట్టిని ఢిల్లీలోని అమృత వాటికకు తరలించి మొక్కలు నాటే పవిత్ర కార్యం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగమద్దిలేటి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు



మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా వినోభాబావే జయంతి

అయిజ: మండలంలోని సంకాపురంలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు, భూదానోద్యమ పితామహుడు వినోభాబావే 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు నర్సింగరావు మాట్లాడారు. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో రాఘవేంద్రరావు, ఉమ, సుమ, గేణేష్ చారి, కృష్ణ, తిరుమలేశ్, వెంకట్రాములు పాల్గొన్నారు.



సంకాపురంలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

యునానీ వైద్యసేవలు ఉపయోగించుకోవాలి



యునానీ వైద్యం గురించి వివరిస్తున్న వైద్యురాలు

గట్టు: యునానీ వైద్య సేవలను ఉపయోగించుకోవాలని యునానీ వైద్యాధికారిని కమ్మురున్నీసా బేగం కోరారు. సోమవారం గట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యునానీ వైద్య సేవల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ జ్ఞాపక శక్తిని పెంపొందించుకునేందుకు, గ్యాస్ట్రబుల్ నుంచి ఉపశమనం పొందేందుకు, ఆకలి వేయడానికి యునానీ మందులు అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. ప్రకృతిలోని మొక్కల వేర్లు, కాండం, ఆకులు, పూలు ఇలా ప్రతి దాంట్లో మానవులకు అవసరమయ్యే ఔషధ గుణాలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి, కేఎస్‌డీ రాజు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: గద్వాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్ పర్సన్ క్యాంపు కార్యాలయంలో గద్వాల మండలంలోని గోన్‌పాడు, ధరూరు మండలంలోని మార్లబీడు, కేటిదొడ్డి మండలాల మైలగడ్డ గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. గద్వాలలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఆనంద్ గౌడ్, ఖాజా, నూర్ అహ్మద్ ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలి

అయిజ: ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ సృజన ఆదేశాల మేరకు సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పర్దీపురంలో ఎస్ఐ ఆధ్వర్యంలో షీ టీం, పోలీస్ కళాబృందం, భరోసా టీం రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల కలిగే అనార్థాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, షీ టీం ఉపయోగాలు, డయల్ 100 ప్రాముఖ్యత, భరోసా కేంద్రం అందిస్తున్న సేవలు, పోలీస్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాధమ్మ, షీ టీం, కళా బృందం సభ్యులు హనుమంతు, కృష్ణ, రామాంజనేయులు, రామిరెడ్డి, భరోసా సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల అందజేత



ఎంపీపీకి కంప్యూటర్లు అందజేస్తున్న కలెక్టర్

గట్టు: మండల పరిధిలోని చాగదోన ఉన్నత పాఠశాలకు కలెక్టర్ వల్లూరుక్రాంతి కంప్యూటర్లు అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎంపీపీ విజయ్‌కుమార్‌కు కలెక్టర్ ఐదు కంప్యూటర్లను అందజేశారు. 'మన ఊరు–మన బడి'లో భాగంగా చాగదోన ఉన్నత పాఠశాలను ఎంతో సుందరంగా తయారు చేశారు. పాఠశాలలో ల్యాబ్, కంప్యూటర్ల ఏర్పాటు చేయాలని ఇదివరకే ఎంపీపీ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో సీబీఎఫ్ నిధుల నుంచి ల్యాబ్ ఏర్పాటుతో పాటుగా ఐదు కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఎంపీపీ విజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మిట్టదొడ్డి సర్పంచ్ నర్సింహులు, తుమ్మలచెరువు జగదీశ్వర్‌రెడ్డి, చిన్న నర్సింహులు, ఆంజనేయులు, జయరాంగౌడు, శివకుమార్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్ట్

అయిజ: హైదరాబాద్‌లో ధర్నాకు వెళ్తున్న ఆశా వర్కర్లను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న 20 మంది ఆశా వర్కర్లను ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. సోమవారం ఆశా వర్కర్లు ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరుతారని ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆశా వర్కర్లను ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదని, వారి డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో ఏఎస్ఐ అయ్యన్న, హెడ్ కానిస్టేబుల్ ఈరన్న, పోలీసులు ఉన్నారు.



ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఆశా వర్కర్లు

'సమగ్ర శిక్ష' ఉద్యోగుల మౌన ప్రదర్శన



దీక్ష శిబిరంలో మౌన ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు వివిధ సంఘాల నాయకులు వేరువేరుగా సంపూర్ణ మద్దతును ప్రకటించారు. 8వ రోజు సోమవారం సైతం కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్ష చేపట్టారు. దీక్ష శిబిరంలోనే ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి మౌన ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. 20 ఏళ్లుగా పనిచేస్తూ గురుకులాలతో సమానంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నా శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయకుంటే ప్రభుత్వంపై సమరం సాగిస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత భీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, ఎస్‌ఓలు శ్రీదేవి, ఆసియాబేగం, అనురాధ, విజయలక్ష్మి, చెన్నబసమ్మ, పద్మ, చంద్రకళ, జనార్థన్, ఖాజా, సమి, శ్యామ్, శ్రీనివాసులు, శేషన్న, రామంజనేయులు, యువరాజు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.